క్లుప్తంగా

సహోద్యోగి వైద్యానికి జైలు సిబ్బంది చేయూత



విజయ్‌కుమార్‌కు నగదు అందజేస్తున్న సెంట్రల్ జైలు అధికారులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ ఆధ్వర్యంలో, జైలు అధికారులు, సిబ్బంది మానవీయ విలువలు, ఐక్యతకు నిదర్శనంగా నిలిచారు. జైలు డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న హోం గార్డ్ ఎన్.విజయ్‌కుమార్ గొంతు క్యాన్సర్ చికిత్స కోసం స్వచ్ఛందంగా రూ.1.19 లక్షలు సేకరించి అందజేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ మాట్లాడుతూ, బాధలో ఉన్న సహోద్యోగికి చేయూతనివ్వడం ప్రతి ఒక్కరి మానవీయ బాధ్యత అన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సిబ్బందిలో ఐక్యతను, పరస్పర నమ్మకాన్ని పెంపొందిస్తాయన్నారు. సహచర ఉద్యోగులు చేయూతనివ్వడంపై విజయ్ ధన్యవాదాలు తెలిపారు. జైలు పర్యవేక్షణాధికారి ఎంరాజ్‌కుమార్, గార్డింగ్ సిబ్బంది సతీష్, సురేష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

స్వస్థత శాలలో తైలాభిషేక ప్రార్థన



విశ్వాసులకు తైలాభిషేక ప్రార్థన చేస్తున్న డాక్టర్ రత్నరాజు

కడియం: గ్రామంలోని షారోను దైవిక స్వస్థత శాలలో ఆదివారం తైలాభిషేక పండగ ఘనంగా జరిగింది. 40 రోజుల పాటు ఉపవాస ప్రార్థనల అనంతరం తైలాభిషేక పండగ నిర్వహిస్తారని స్వస్థత శాల నిర్వాహకులు డాక్టర్ డి.రత్నరాజు తెలిపారు. తైలాభిషేకం ద్వారా ప్రతిష్ఠిత పరిశుద్ధత ప్రభు తేజస్సు వ్యక్తుల్లో నిండి ఉంటుందని బైబిల్ లేఖనాల ద్వారా తెలుస్తోందన్నారు. సరోజినీ రత్నరాజు ఆరాధనతో కార్యక్రమాన్ని నడిపించారు. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన విశ్వాసులకు సన్నిధి, యూత్ వసతులు సమకూర్చారు.

అభిమానుల సేవలు అభినందనీయం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రక్తదానంతో పాటు, ఉచిత వైద్య శిబిరాలు, సేవా కార్యక్రమాలు చేపడుతున్న మెగాస్టార్ చిరంజీవి అభిమానులు అభినందనీయులని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం చిరంజీవి జన్మదిన వేడుకల్లో భాగంగా రాష్ట్ర చిరంజీవి యువత ప్రధాన కార్యదర్శి ఏడిద బాబీ ఆధ్వర్యంలో స్థానిక ఇన్నీసుపేట సప్పావారివీధి మున్సిపల్ పాఠశాల వద్ద ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని మంత్రి ప్రారంభించారు. అభిమానులను సామాజిక సేవా కార్యక్రమాల వైపు మలిచిన గొప్ప నాయకుడు చిరంజీవి అని కొనియాడారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



ఆలయంలో హోమం నిర్వహిస్తున్న పండితుడు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నగరంలోని కోటిపల్లి బస్టాండ్ సెంటర్‌లో ఉన్న విజయ దుర్గాలయం 17వ వార్షికోత్సవం మాజీ కార్పొరేటర్ బట్లంకి ప్రకాష్ ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. కోటిపల్లి బస్టాండ్ ఆటో యూనియన్ పర్యవేక్షణలో ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం వెలిచేరుకు చెందిన కాశీభట్ల భైరవశర్మ అర్చకత్వంలో హోమాలు జరిగాయి. అనంతరం శివలింగ దీపాలంకరణ చేశారు. ఆటో యూనియన్ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారని ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్యశర్మ తెలిపారు.

సూర్యదేవుని సన్నిధిలో పూజలు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధిచెందిన ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవుని సన్నిధిలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి రుత్విక్కులు పంచామృతాభిషేకాలు, వ్రత పూజలు చేశారు. స్వామి వారిని విశేష సంఖ్యలో భక్తులు దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

క్వారీ.. వర్రీ

- భారీ గోతుల నుంచి ముప్పు తప్పునా..!
- ప్రాణాలు కోల్పోతున్న అమాయకులు
- రోగాల బారిన పడుతున్న స్థానిక ప్రజలు
- స్పందించని సంబంధిత అధికార యంత్రాంగం
- జిల్లా కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు





నిండు కుండలా ప్రమాదకరంగా మారిన క్వారీ గోతులు

రాజమహేంద్రవరం సిటీ: ప్రాణాంతకంగా మారిన క్వారీ గోతుల్లో ప్రమాదాల నివారణకు యుద్ధప్రాతిపదికన రక్షణ చర్యలు చేపట్టక పోవడంతో అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు. పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న పేద వర్గాల ప్రజలు తీవ్ర అనారోగ్యాల బారిన పడుతున్నారు. నగర శివారు ప్రాంతాలైన రామదాసుపేట, సుబ్బారావునగర్ ప్రాంతాలకు చెందిన ప్రజలు క్వారీ గోతుల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్వారీ ప్రాంతంలో సంభవిస్తున్న ప్రమాదాల నివారణకు తక్షణమే రక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞాపనలు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని క్వారీ ప్రాంత పోరాట నాయకుడు, కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ బర్రే కొండబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి క్వారీ గోతులు పూడ్చాలని ప్రజా పోరాటాలు, న్యాయ పోరాటాలు చేస్తున్నా.. ప్రభుత్వం ఏ విధమైన చర్యలు చేపట్టడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టర్ పర్యటించినా..

ఇటీవల ఆ ప్రాంతంలో జిల్లా కలెక్టర్ ప్రశాంతి పర్యటించారు. సుబ్బారావునగర్, సింహాచలనగర్ ప్రాంతాల్లోని క్వారీ గోతుల్లో ఇకపై మనుషులు పడిపోకుండా ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు, హెచ్చరిక బోర్డులు, రాత్రిపూట లైటింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే సున్నపు బట్టీ లేఅవుట్ రోడ్డు వెడల్పు చేయాలని అధికారులను ఆదేశించారు. కానీ ఇంతవరకూ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం దారుణమంటూ బర్రే కొండబాబు ఆవేదన వ్యక్తం చేశారు. క్వారీ గోతుల్లో చేరిన నీటి నిల్వ వల్ల దోమలు విపరీతంగా పెరిగి.. మలేరియా, టైఫాయిడ్, డెంగీ లాంటి వ్యాధులు ప్రబలుతున్నాయని, అధికారులు కనీస చర్యలు చేపట్టడం లేదని స్థానికులు వాపోతున్నారు.

నిబంధనలు పాటించకపోవడంతో..

రామదాసుపేట, సుబ్బారావునగర్‌లోని మెటీరియలాజికల్ బెల్టులో మూడు దశాబ్దాలుగా రోడ్డు మెటల్ క్వారీలను నిర్వహిస్తున్నారు. క్వారీ లీజు పొందిన 51 సంస్థలు మెటల్ తవ్విన అనంతరం క్వారీని మట్టితో పూడ్చాలనే నిబంధన స్పష్టంగా ఉంది. దీనిని పాటించకపోవడంతో క్వారీ గోతుల్లో 150 అడుగుల మేర నీరు చేరింది. ఇందులో అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారని, ఈ విషయమై ఇప్పటి వరకూ అనేక ఫిర్యాదులు చేసినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్వారీల వల్ల సమీప ప్రాంతాల్లో నివసించే ప్రజలు రాకపోకలు సాగించే రహదారి అపాయకరంగా మారిందని వాపోతున్నారు. రెండున్నర కిలోమీటర్ల మేర రహదారిని నిర్మించి, దానికి ఫెన్సింగ్ వేయడంతో పాటు, లైటింగ్, సైన్ బోర్డులు, సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించి మూడు నెలలవుతున్నా పట్టించుకున్న నాథుడే లేడని స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు చేపట్టి, క్వారీ ప్రాంతవాసులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆదేశాలు పట్టించుకోలేదు



ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేస్తున్న కార్యక్రమాల్లో ఇప్పటి వరకూ పది సార్లు వినతిపత్రాలు అందించాను. క్షేత్ర స్థాయి అధికారులు ఏవిధమైన చర్యలు చేపట్టకుండానే తమ పరిశీలన పూర్తయినట్లు రికార్డులు చేస్తున్నారు. ఇదెక్కడి న్యాయమో అర్థం కావడం లేదు. క్వారీ ఏరియాలో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని మైన్స్, ఆర్అండ్‌బీ, నగరపాలక సంస్థ అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినా ఏ విధమైన ప్రయోజనం లేకుండా పోయింది. ప్రజలకు ప్రమాదకరంగా మారిన క్వారీ గోతుల పూడ్చివేతకు న్యాయ పోరాటం, ప్రజా పోరాటం చేస్తున్నాం. ఇక స్థానిక మహిళలతో కలసి ప్రత్యక్ష పోరాటానికి యోచిస్తున్నాం.
– బర్రే కొండబాబు, మాజీ చైర్మన్, కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ

రోగాల బారిన పడుతున్నాం



క్వారీ గోతుల్లో నిల్వ నీరు పెరిగిపోవడం వల్ల దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. దీని వల్ల డెంగీ, మలేరియా, ఫైలేరియా వంటి వ్యాధులు ప్రబలుతున్నాయి. స్థానికంగా మౌలిక సదుపాయాలు అందడం లేదు. క్వారీ చుట్టుపక్కల నివాసం ఉంటున్న పేద వర్గాలకు చెందిన కుటుంబాలు నిత్యం ప్రాణభయంతో జీవనం సాగించాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, క్వారీ గోతులను పూడ్చించే చర్యలు చేపట్టాలి.
– బలగం రాజవేణి, స్థానిక మహిళ

విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: మరమ్మతుల నేపథ్యంలో సోమ, బుధవారాల్లో నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం ఈఈ నక్కపల్లి శామ్యూల్ ఆదివారం తెలిపారు. ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ టిడ్కో గృహాలు, తొర్రేడు, వెంకటనగరం గ్రామాల్లో అంతరాయం ఉంటుందన్నారు. వ్యవసాయ విద్యుత్ అవసరాలకు ఉదయం ఐదు నుంచి ఎనిమిది గంటల వరకూ, మధ్యాహ్నం రెండు నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకూ సరఫరా ఉంటుందన్నారు. సోమవారం, 14వ తేదీన ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకూ సావిత్రీనగర్, రామకృష్ణ నగర్, ఆదర్శ నగర్, చైతన్య నగర్, నాగిరెడ్డి నగర్, స్టేషన్ రోడ్ ఏరియాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు.

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

కడియం: మండల కేంద్రమైన కడియంలో యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు బి.అబ్బాయి, వి.శాస్త్రి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సంఘ జిల్లా కార్యదర్శి చిలుకూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ, విలువే ప్రధాన ధ్యేయంగా ఏర్పడిన ఉపాధ్యాయ సంఘం యూటీఎఫ్ అన్నారు. ఉపాధ్యాయ నేత ఆర్వీ రమణ సంఘ పతాకాన్ని ఎగురవేసి, గౌరవ వందనం స్వీకరించారు. ఉపాధ్యాయ ఉద్యమ గీతాలను ఆలపించారు. యూటీఎఫ్ నాయకులు గోపాలకృష్ణ, పి.నాగేశ్వరరావు, దొరబాబు, ఆనంద విజయకుమార్, ఆకుల వీర్రాజు, సందీప్, ఉంగరాల వీరభద్రరావు, అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా



కడియంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ



ధవళేశ్వరంలో ర్యాలీలో పాల్గొన్న ఆర్డీవో కృష్ణనాయక్ తదితరులు

కడియం: మండల కేంద్రమైన కడియంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని ఆదివారం ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాలతో గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, ఎంపీడీవో కె.రమేష్, తహసీల్దార్ సునీల్‌కుమార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆగస్టు 15న స్వాతంత్ర్య దిన వేడుకలను వైభవంగా నిర్వహించాలన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసే విధంగా ప్రజలను చైతన్య పరచాలన్నారు. అందులో భాగంగా ఈ ర్యాలీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో సుబ్బారావు, సీనియర్ అసిస్టెంట్ దాస్, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలు, అంగన్‌వాడీ, వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

జాతీయ స్ఫూర్తిని పెంపొందించాలి

ధవళేశ్వరం: హర్ ఘర్ తిరంగా ర్యాలీ ధవళేశ్వరంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఆర్డీవో ఆర్ కృష్ణనాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి ధవళేశ్వరం ప్రధాన రహదారిపై ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఆర్డీవో కృష్ణనాయక్ మాట్లాడుతూ, స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించామన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తి, జాతీయ స్ఫూర్తి పెంపొందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సునీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, పంచాయతీ కార్యదర్శి జి.వెంకట్రావు, నాయకులు మత్స్యేటి ప్రసాద్, పందూరి అప్పారావు, వర్రే చిన్ని తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



జీపీఆర్ తోటలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు జీపీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి 2007–08 బ్యాచ్ పూర్వ విద్యార్థులు జీపీఆర్ తోటలో ఆత్మీయ కలయిక పేరుతో కలిశారు. ఈ సందర్భంగా తరగతి గదుల్లో చిన్ననాటి నిక్‌నేమ్‌లతో పిలుచుకుంటూ, తరగతి గదుల్లో చిలిపి పనులను గుర్తుచేసుకున్నారు. సాయంత్రం వరకు ఉత్సాహంగా తమ ఆనందాలను పంచుకున్నారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు.

అలరించిన సంగీత విభావరి



గీతాలాపన చేస్తున్న తేజస్విని, రాజేశ్వరరావు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): శ్రీహరి ఈవెంట్స్ ఆధ్వర్యంలో స్థానిక వేంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో నెలకో పున్నమి 41వ కార్యక్రమంగా ఆదివారం రాత్రి నిర్వహించిన సంగీత విభావరి అలరించింది. పాడుతా తీయగా, ఐడియా సూపర్ సింగర్స్‌లో పాల్గొని, పలు సినిమాల్లో గీతాలు ఆలపించిన తేజస్విని ఈ కార్యక్రమానికి విచ్చేసి ఔత్సాహిక గాయకులతో కలిసి పాడారు. మధుర గాయకులు మల్లాది బాలకృష్ణమూర్తి ఆశీస్సులతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మల్లాది రాజేశ్వరరావు, పిరాట్ల శ్రీహరి, వరసా శ్రీనివాస్, మదర్సా అలీ తదితరులు గీతాలు ఆలపించారు. జివ్వుమంది కొండగాలి, ఎల్ అంటే ఓ అంటే వి అంటే ఈ అంటే, సందెపొద్దులకాడ సంపంగి నవ్వింది, హేపిల్ల హల్లో పిల్ల తదితర గీతాలు శ్రోతలను మైమరపించాయి.

గట్టు జారి పోతా ఉంది

- అనేక గ్రామాలకు పొంచి ఉన్న పెను ముప్పు
- కోతకు గురవుతున్న గోదావరి ఏటిగట్టు
- అరకొర పనులతో మమ అనిపిస్తున్న ప్రభుత్వ యంత్రాంగం



బొబ్బిల్లంక వద్ద ఏటిగట్టును ఆనుకుని గోదావరి వరద ప్రవాహం



బొబ్బిల్లంక వద్ద కోతకు గురవుతున్న ఏటిగట్టు

సీతానగరం: అఖండ గోదావరి వరద నుంచి కాపాడే ఏటిగట్టుకు పెను ప్రమాదం పొంచి ఉంది. గోదావరి వరద నుంచి ఏటిగట్టుకు రక్షణ కరవైంది. వరదతో ఏటిగట్టు కోతకు గురై బలహీనపడుతోంది. అఖండ గోదావరి లెఫ్ట్ బ్యాంక్(ఏజీఎల్‌బీ) అధికారులు మాత్రం అరకొర పనులతో మమ అనిపిస్తున్నారు. కొన్నేళ్లుగా వరద వల్ల ఏటిగట్టు జారిపోయి బలహీనంగా ఉన్న ప్రదేశాల్లో ఇరిగేషన్, అఖండ గోదావరి లెఫ్ట్ బ్యాంక్ అధికారులు ఇసుక బస్తాలు వేసి చేతులు దులుపుకొనేవారు.

బలహీన పడిన ఏటిగట్టు

గోదావరి వరద నుంచి రక్షించే ఏటిగట్టు బొబ్బిల్లంక నుంచి పురుషోత్తపట్నం వరకుంది. కాటవరం ఇసుక ర్యాంపు సమీపంలో మునికూడలి వద్ద ఏటిగట్టు బలహీన పడింది. 2012లో ధవళేశ్వరం నుంచి కూలీలను రప్పించి, ఇసుక బస్తాలను ఏటిగట్టు అంచున వేశారు. ఏటిగట్టు నుంచి ఇంకా లంకభూమి ఉండటంతో ఎటువంటి ముప్పు వాటిల్లలేదు. సీతానగరం లంకూరు వద్ద ఏటిగట్టు బలహీన పడిందని ఇసుక బస్తాలు వేశారు. ఇప్పటి వరకు ఏటిగట్టును పట్టించుకున్న దాఖలాలు లేవు. గట్టును పటిష్టపర్చడానికి చర్యలూ తీసుకోలేదు. వరద ఉధృతంగా వస్తే ఏటిగట్టు వరకు ప్రవాహం చేరుతుంది. ఇలాగే వదిలేస్తే కొన్నేళ్లకు ఏటిగట్టు పూర్తిగా కోతకు గురయ్యే అవకాశం లేకపోలేదు.

పొంచి ఉన్న పెను ముప్పు

వరద నిత్యం ఏటిగట్టును ఆనుకుని ఉండేది జాలిమూడి, బొబ్బిల్లంక వద్ద మాత్రమే. ఏటిగట్టును ఆనుకుని ఉన్న లంకభూమి కోతకు గురైంది. గతేడాది కూటమి ప్రభుత్వం బొబ్బిల్లంక వద్ద కోతకు గురవుతున్న ఏటిగట్టు వద్ద రాళ్లు వేసి చేతులు దులుపుకొంది. ఈ ఏడాది వరద మొదలై నెల రోజులైంది. ఏటిగట్టు వద్ద కేవలం 115 మీటర్ల వరకు రాళ్లు వేస్తున్నారు. జాలిమూడి నుంచి బొబ్బిల్లంక వరకు ఏటిగట్టును అరకొర పనులతో సరిపెడుతున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో..

గోదావరి వరదతో 2023 జూలైలో జాలిమూడి వద్ద ఏటిగట్టుకు ప్రమాదం ఉందని గ్రహించిన అప్పటి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా.. రక్షణ చర్యల్లో భాగంగా ఇసుక బస్తాలు వేయించారు. ఏటిగట్టును ఆనుకుని ఎర్త్ బాండ్స్ బలహీనంగా ఉండడంతో, వీటి మరమ్మతులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.24 కోట్ల అంచనా వ్యయంతో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ నుంచి నిధుల మంజూరుకు అభ్యర్థించారు. అప్పటి ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. గతేడాది జూలై నెలాఖరున బొబ్బిల్లంక వద్ద గోదావరి వరదతో ఏటిగట్టు కోతకు గురవ్వడం మొదలైంది. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ నుంచి నిధుల కోసం స్థానిక కూటమి ఎమ్మెల్యే ముందస్తుగా ప్రయత్నించి ఉంటే, ఏటిగట్టు రక్షణ పనులు ప్రారంభమయ్యేవి.

గండి పడితే..

ఏటిగట్టుకు గండి పడితే సీతానగరం మండలంతో పాటు, గోకవరం, కోరుకొండ, రాజానగరం మండలాల్లో కొన్ని గ్రామాలు, రాజమహేంద్రవరం రూరల్‌లో కొన్ని గ్రామాలు ముంపునకు గురవుతాయి. వరద నీరు తిరిగి బొబ్బిల్లంక స్లూయిజ్ నుంచి గోదావరిలోకి వెళ్లాల్సి ఉంది. గండి పడితే నెల రోజుల కన్నా పైబడి నీరు వెళ్లడానికి సమయం పడుతుంది. దీంతో ప్రజలు వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. అధిక సంఖ్యలో ప్రాణనష్టం కలగవచ్చు. జనావాసాలకూ ముంపు బెడద తప్పదు. జీవన విధనం అస్తవ్యస్తంగా మారుతుంది.

అరకొర పనులు

బొబ్బిల్లంక వద్ద నిత్యం ప్రవాహం ఉండటంతో ఏటిగట్టు కోతకు గురవుతుంది. జాలిమూడి నుంచి బొబ్బిల్లంక వరకు ఏటిగట్టు కోతకు గురవుతుంటే, బొబ్బిల్లంక వద్ద కేవం 115 మీటర్లు మాత్రమే పటిష్టపర్చేలా రూ.2.68 కోట్లతో ఏజీఎల్‌బీ అధికారులు పనులు చేపట్టారు. స్టోన్ రివిట్‌మెంట్, పిచ్చింగ్ ప్లాట్‌ఫామ్‌లు నిర్మించేలా చర్యలు తీసుకుంటున్నారు. కోతకు గురవుతున్న 1,385 మీటర్ల ఏటిగట్టుకు రక్షణ చర్యలు చేపట్టలేదు. వరద సమయంలో ఏటిగట్టును ఆనుకుని ఉన్న పురుషోత్తపట్నం, వంగలపూడి, రామచంద్రపురం, సింగవరం, సీతానగరం, రఘుదేవపురం, ముగ్గళ్ల, ఇనగంటివారిపేట, వెదుళ్లపల్లి, రాజంపేట, మునికూడలి, కాటవరం, జాలిమూడి, బొబ్బిల్లంక గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమని ఉంటున్నారు.

ఏటిగట్టుకు ప్రమాదమే..



గోదావరి వరద ఉధృతంగా వస్తే ఏటిగట్టుకు ప్రమాదమే. జాలిమూడి నుంచి బొబ్బిల్లంక వరకు ఏటిగట్టు కోతకు గురైంది. జాలిమూడి వద్ద గతంలో ఇసుక బస్తాలు వేశారు. ఇప్పుడు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. గోదావరి వరద వస్తే రాత్రుళ్లు నిద్ర ఉండడం లేదు. ఏసమయంలో ఏటిగట్టుకు గండి పడుతుందనే భయం కలుగుతుంది. బొబ్బిల్లంక వద్ద ఏడాది నుంచి కోతకు గురవుతున్న ఇప్పటి వరకు పనులు చేపట్టలేదు. ఇప్పుడు అరకొర పనులు చేస్తున్నారు.
– రూపం ఏసోబు, బొబ్బిల్లంక

కొంత వరకే చేస్తున్నారు



ఏటిగట్టు కోతకు గురవుతున్న ప్రాంతం ఒకటిన్నర కిలోమీటర్లు పైగా ఉంటుంది. బొబ్బిల్లంక వద్ద కొద్దిమేర మాత్రమే పనులు చేస్తున్నారు. బండరాళ్లు తెచ్చి గోదావరిలోకి ఏటిగట్టు అంచు నుంచి విడుస్తున్నారు. పైకి బండరాళ్లు వచ్చే వరకు వేస్తున్నారు. మిగిలిన ఏటిగట్టు పటిష్టపర్చడానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదు. వరద ఉధృతంగా వస్తే ప్రమాదం అంచున ఉన్నట్లే. ఎక్కడ గండి పడుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.
– మెల్లిమి రామచంద్రరావు, సర్పంచ్, బొబ్బిల్లంక

రూ.35 కోట్లతో అంచనాలు పంపాం



గోదావరి వరదకు కోతకు గురవుతున్న బొబ్బిల్లంక వద్ద 115 మీటర్లుకు రూ.2.68 కోట్లతో స్టోన్ రివిట్‌మెంట్, పిచ్చింగ్ ప్లాట్‌ఫామ్‌లు నిర్మించేలా పనులు చేపట్టాం. బొబ్బిల్లంక వద్ద ఏటిగట్టు కోతకు గురవుతుంది. రక్షణ చర్యల్లో భాగంగా పనులు చేపట్టాం. మిగిలిన 1,385 మీటర్లకు రూ.35 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు పంపించాం. మంజూరైన వెంటనే మిగిలిన ఏటిగట్టు పటిష్ట పనులు ప్రారంభిస్తాం.
– ఎ.శివప్రసాద్, ఏఈ, అఖండ గోదావరి లెఫ్ట్ బ్యాంక్